క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల కిటకిట


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తమ మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావడంతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కొల్లాటి రామారావు, ఈఓ డి.రామకృష్ణంరాజు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా స్త్రీల ఆదివారం


పాలకమ్మచెరువు చర్చిలో సర్పంచ్‌ను సన్మానిస్తున్న సంఘస్తులు

మొగల్తూరు: స్థానిక పంచాయతీలోని పాలకమ్మచెరువులో క్రీస్తు లూథరన్ చర్చిలో ఆదివారం స్త్రీల ఆరాధనా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ పడవల మేరీ మాట్లాడుతూ చిన్నారుల నుంచి పెద్దల వరకూ బైబిల్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పడవల మేరీ, సంఘ సేవకురాలు నేతల కుమారి స్టీఫెన్‌లను సంఘస్తులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ ఎన్.స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ శాంతిధాంలో క్షీరాభిషేకం


పెనుగొండ వాసవీ శాంతి ధాంలో క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

పెనుగొండ: అక్షర తృతీయ సందర్భంగా అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని పెనుగొండ వాసవీ శాంతి ధాంలో వాసవీ మాతకు ఆదివారం 1108 లీటర్లతో క్షీరాభిషేకం చేశారు. ఆదివారం ఉదయం నుంచి కర్ణాటక బెంగుళూరు నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు అభిషేకాలు, పంచామృతాభిషేకం, ద్వాదశ జ్యోతిర్లింగాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వయంగా అభిషేకం చేయడం విశేషం.

రజకుల శ్రమదానం


సిద్ధాంతంలో చెరువుల వద్ద శ్రమదానం చేస్తున్న రజకులు

పెనుగొండ: రజక జనసేవా సంఘం ఆధ్వర్యంలో సిద్ధాంతంలో చెరువు వద్ద సంఘ సభ్యులు శ్రమదానం చేశారు. ఆదివారం ఉదయం నుంచి కుల వృత్తి చేసుకొనే చెరువుల వద్ద పెరిగిపోయిన ముళ్లకంపలు, మందుబాబులు తాగి పాడేసిన ఖాళీ మద్యం బాటిళ్లను సంఘ అధ్యక్షుడు దువ్వారపు వెంకట్రావు నాయకత్వంలో 75 కుటుంబాలకు చెందిన వారు శుభ్రపరిచారు. చెరువులతో పాటు, బట్టలు ఆరవేయడానికి అనువుగా చెరువు గట్టులను తీర్చిదిద్దుకున్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు

ఆకివీడు: మండలంలోని దుంపగడప శివారు ఉప్పుటేరు సమీపంలో జాతీయరహదారికి చేర్చి ఉన్న ప్రభుత్వ భూమి మెరక పనుల్ని ఆదివారం నిలుపుదల చేసినట్టు తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వర్లు చెప్పారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయితే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ భూముల్లో ఏ విధమైన పనులు చేపట్టరాదని ఆయన హెచ్చరించారు. ట్రాక్టర్ల ద్వారా మట్టి మెరక పనులను వీఆర్వోలతో నిలుపుదల చేయించామన్నారు.

26న వాహనాల వేలం

వీరవాసరం: వీరవాసరం పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో జప్తు చేయబడిన వాహనాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈనెల 26వ తేదీన ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు ఎస్సై పి.రమేష్ ఆదివారం చెప్పారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి గల అభ్యర్థులు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పేకాట శిబిరాలపై దాడి

వీరవాసరం: బలుసుగొయ్యిలపాలెం గ్రామం శివారు రాజులుగరువులో కోత బంతి పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై పి.రమేష్ ఆదివారం చెప్పారు. వీరి నుంచి రూ.76,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వాతావరణ మార్పులతో రైతుల్లో గుబులు

- పంటను ఒబ్బిడి చేసుకుంటున్న రైతన్నలు
- రెండు రోజుల వరికోతలు వాయిదా వేయాలని అధికారుల సూచన


వెలగలేరులో రోడ్డుపై ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు కూలీలు


ఓడూరు గ్రామంలో వాతావరణం మేఘాలు కమ్మడంతో ధాన్యం ఆరబోసేందుకు ఎదురు చూస్తున్న మహిళా కూలీలు


చిన్నంవారి పాలెంలో ధాన్యం రాశిని రక్షించుకుంటున్న రైతన్న


వడలిలో ధాన్యంపై బరకాలు కప్పిన రైతన్నలు


రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారి స్పందన

పెనుమంట్ర: తులు ఆరుగాలం శ్రమించి పండించిన వరిపంట ఆశాజనకంగా ఉండి ఎకరాకు 55 నుంచి 60 బస్తాల వరకు దిగుబడి వస్తున్నప్పటికీ ఆదివారం వాతావరణంలో మార్పులు చేసుకోవడంతో రైతులు ఒక్కసారిగా అలెర్ట్ అయ్యారు. ఒక పక్క రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతలు ముమ్మరంగా జరుగుతుండగా రైతులు తమ ధాన్యాన్ని రోడ్లపైకి తెచ్చి ఆరుబెడుతున్నారు. ఆరిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైతు భరోసా కేంద్రాల సాయంతో రైసు మిల్లులకు రవాణా చేస్తున్నారు. అయితే శనివారం అర్ధరాత్రి నుంచే వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు వచ్చి ఉరుములతో కూడిన జల్లులు పడటంతో రైతులు కంగారుపడ్డారు. ఇదే పరిస్థితి ఆదివారం మధ్యాహ్నం వరకు ఉండటంతో రైతులు ఎక్కడికక్కడే తమ ధాన్యాన్ని రోడ్లపై పోసి, బరకాలతో కప్పి ఉంచారు. ఆరుదల అయిన ధాన్యాన్ని సంచులలో పట్టి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మధ్యాహ్నం నుంచి కొంచె వాతావరణం తెరపి ఇవ్వడంతో నిలిచిపోయిన వరికోతలను మళ్లీ తిరిగి ప్రారంభించి ధాన్యాన్ని గట్లపైకి రవాణా చేస్తున్నారు. మండలంలో 12,307 ఎకరాలలో 6,781 మంది రైతులు వరిసాగు చేసారు. దీనిద్వారా 52,675 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందనే అంచనాతో ప్రభుత్వం మండలంలోని 18 రైతు భరోసా కేంద్రాల ద్వారా 2.25 లక్షల గోనె సంచులను రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచి రైతులకు సరఫరా చేస్తున్నారు. అయితే ప్రభుత్వం మొదట రైతుకు ఎకరాకు 94 సంచులు ఇచ్చేందుకు అనుమతి ఇచ్చింది. అయితే దిగుబడి శాతం పెరగడంతో ఆ సంఖ్యను 100కి పెంచుతూ రైతులకు గోనె సంచులను సరఫరా చేస్తున్నారు. వాతావరణం అనుకూలిస్తే తమ ధాన్యం సురక్షితంగా రైసుమిల్లులకు చేరుతుందని రైతులు వరుణ దేవుడిని వేడుకుంటున్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: వాతావరణంలో మార్పుతో ఆదివారం తెల్లవారుజామునన కురిసిన అకాల వర్షంతో రైతులు గుండెల్లో గుబులు మొదలైంది. నాలుగు రోజులుగా కోతలు ప్రారంభం కావడంతో దిగుబడులు సైతం ఆశించన దాని కన్నా అధికంగా రావడంతో రైతుల్లో ఆనందం నెలకొంది. దీంతో వరికోతల్లో ముమ్మరంగా ఉన్న రైతన్నల ఆశల్లో అకాలవర్షం నీళ్లు జల్లింది. కాలం కాని కాలంలో వర్షం కురవడంతో రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ మండలంలో 11793 వేలు ఎకరాలు, ఆచంట మండలంలో 10389 ఎకరాలు, పెనుమంట్ర మండలంలో12246 ఎకరాలు పోడూరు మండలంలో 13491 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే వారం రోజుల్లో 20 శాతం మేర కోతలు పూర్తి చేశారు. వాతావరణం అనుకూలంగా ఉందన్న దృష్టితో కొందరు రైతులు కోసిన ధాన్యాన్ని రక్షణ లేకుండా రాసులుగా చేసుకొన్నారు. ఒక్కసారిగా వర్షం కురవడంతో హడావిడిగా ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్నారు. అయితే వ్యవసాయాధికారులు మాత్రం రైతులు రెండు రోజుల పాటు వరికోతలు వాయిదా వేసుకోవాలని సూచిస్తున్నారు.

వైభవంగా బసవేశ్వరుని జయంతి


దగ్గులూరులో చల్లా అన్నపూర్ణేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరులో కర్ణ భక్తుల ఆరాధ్యదైవం బసవేశ్వర స్వామి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో బసవేశ్వరస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా బసవేశ్వరస్వామి చరిత్ర పుస్తకం రచించిన చల్లా అన్నపూర్ణేశ్వరరావును శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విశ్వనాథం కనకభద్రం, ఎంపీటీసీ శాగ సత్యనారాయణ, చినగోపురం చైర్మన్ గాదె వెంకన్న, బీజేపీ నాయకుడు జక్కంపూడి కుమార్, సప్పరపు పార్వతీశం, వాసా లక్ష్మణకుమార్, చల్లా మల్లేశ్వరరావు, సమతం రమణ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్, వాలీబాల్ కిట్ల పంపిణీ

వీరవాసరం: యువత వేసవిలో చెడు వ్యసనాలకు దూరంగా ఆటపాటలతో కాలం గడపాలని చింతలకోటి గరువు గ్రామ సర్పంచ్ దాసరి మహాలక్ష్మి అన్నారు. గ్రామంలో యువతకు క్రికెట్, వాలీబాల్ కిట్లను ఆమె ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత ఆటపాటలతో పాటు చదువులోనూ రాణించి జీవితంలో పైకి రావాలని ఆకాంక్షించారు. దాత దాసరి మాణిక్యాలరావు ఆర్థిక సహాయంతో సుమారు రూ.15 వేలు విలువైన కిట్లను అందజేసినట్లు పేర్కొన్నారు. కాకిలేటి బాసు, దాసరి తాతాజీ, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు


యలమంచిలిలంకలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న గుణ్ణం నాగబాబు

యలమంచిలి: విద్య ద్వారా మాత్రమే సమాజంలో మార్పు, గుర్తింపు వస్తుందని నమ్మి, నిరూపించిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జీవితం నేటికీ మనందరికీ అనుసరణీయమని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ కన్వీనర్ కవురు శ్రీనివాస్ అన్నారు. యలమంచిలిలంక గ్రామంలోని రాంజీ నగర్‌లో ఆదివారం జరిగిన అంబేడ్కర్ జయంతి ఉత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ముందుగా ఆయన స్థానిక దళిత సంఘాల నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటరానితనం శిఖరాగ్ర స్థాయిలో ఉన్న రోజుల్లో అనేక అవమానాలను ఓర్చుకుని అంబేడ్కర్ ఉన్నత చదువులు చదవడం వలనే రాజ్యాంగాన్ని రచించే అవకాశం పొందారన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాత కావడం వల్లే మన దేశంలో నేడు బడుగు, బలహీన, దళిత, అట్టడుగు వర్గాల ప్రజలు శాంతి సౌఖ్యాలతో జీవిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా స్థానికుల కోరిక మేరకు శ్మశానవాటికకు రోడ్డు, విద్యుత్ సౌకర్యం కల్పించడంతోపాటు లక్ష్మీపాలెం, యలమంచిలిలంక గ్రామాల మధ్య నక్కల కాల్వపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. సర్పంచ్ వల్లభు సాయి వెంకట నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎంపీపీ రావూరి వెంకటరమణ సర్పంచ్‌లు చిలుకూరి సుబ్బారావు చౌదరి, పాలంకి శ్రీనివాసరావు, కవురు గోపి, పొన్నమండ నాగరాజు ఎంపీటీసీ సభ్యులు దేగల సూర్యప్రభ, ఇసుకపల్లి శ్రీధర్‌వర్మ సొసైటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, నాయకులు ఇసుకొండ రవి, ఉచ్చుల స్టాలిన్, వల్లభు రంగబాబు, చీకటపల్లి మంగరాజు, ఉన్నమట్ల కబర్ధి, ముడకల గోపాలరావు, మురాల అమృతరావు, జగతాడి గంగరాజు, దంపనబోయిన వెంకటరత్నం, బద్దే రాజభూషణం తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలతో నడుచుకోవాలి

పాలకొల్లు సెంట్రల్: అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ ఒక్కరేనని చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు తెలిపారు. స్థానిక పెదపేట అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ 132వ జయంతి కార్యక్రమం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నాగబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ నేటి యువతరం విద్యార్థులందరూ అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు. ముందుగా అంబేడ్కర్, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేవతట్ల ఆనంద్ దంపతులు పేదలకు ఏర్పాటు చేసిన చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నమట్ల కబర్ధి, వైఎస్సార్ పార్టీ నాయకులు గుణ్ణం సురేష్, గాది ఆంజనేయులు, ఎల్ ఖగరాజు, సంఘ సభ్యులు దేవతట్ల అబ్బులు, పంబ బాలాజీ, పంబ నానిబాబు, పంబ నతానియేలు, దేవతట్ల జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కువైట్‌లో కొమ్ముచిక్కాల వాసి మృతి

పోడూరు: ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన వ్యక్తి అక్కడ మృతి చెందడంతో పోడూరు మండలం కొమ్ముచిక్కాల శివారు ఏఎస్ఆర్ కాలనీలో విషాదం నెలకొంది. మృతుని కుటుంబసభ్యులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమ్ముచిక్కాల శివారు ఏఎస్ఆర్ కాలనీకి చెందిన తండా చార్లెస్(40) 5 ఏళ్ల కిందట ఉపాధి నిమిత్తం కువైట్ దేశానికి వెళ్లాడు. అతనికి భార్య బేబి, కుమారులు రవి, సుధీర్‌లు ఉన్నారు. రవి 9వ తరగతి, సుధీర్ 7వ తరగతి చదువుతున్నారు. ఉపాధి నిమిత్తం వెళ్లిన చార్లెస్ అక్కడ ఒక షేట్ దగ్గర డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా చార్లెస్ అక్కడ గుండెపోటుతో ఈ నెల 18న మృతి చెందాడు. ఈ విషయాన్ని అక్కడి సేట్ కొమ్ముచిక్కాలలోని చార్లెస్ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి సమాచారమిచ్చాడు. చార్లెస్ తల్లి వజ్రమ్మ, సోదరి అన్నామణి కూడా అదే దేశంలో ఉన్నారు. వారి ద్వారా సమాచారం తెలుసుకున్న అక్కడి తెలుగువారు చార్లెస్ భౌతికకాయాన్ని స్వదేశానికి పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. వారి చొరవతో ఆదివారం మధ్యాహ్నం చార్లెస్ భౌతికకాయం స్వగ్రామమైన కొమ్ముచిక్కాలకు చేరుకుంది. తల్లి, సోదరి కూడా భౌతికకాయంతో పాటు స్వగ్రామానికి వచ్చారు. ఆదివారం చార్లెస్ భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.

మేరీకి అండగా నిలుస్తాం

జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్


పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో మేరీని పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: గృహ సారథిగా పనిచేస్తున్న రొక్కాల మేరీని దుర్భాషలాడుతూ ఆమెపై విచక్షణా రహితంగా దాడి చేసిన ముగ్గురుపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ పోలీసులు అధికారులకు ఆదేశాలిచ్చారు. పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మేరిని ఆదివారం శ్రీనివాస్ పరామర్శించారు. దాడి జరిగిన తీరును మేరీని అడిగి తెలుసుని సానుభూతి వ్యక్తం చేశారు. మేరీకి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ వైద్యులను కోరారు. అవసరమైతే మరికొన్ని రోజులు ప్రభుత్వాసుపత్రిలోనే ఉంచి వైద్య చికిత్స అందించాలన్నారు. డీఎస్పీ, సీఐలతో ఫోన్‌లో మాట్లాడి నిందితులను తక్షణం అరెస్ట్ చేయాలని కోరారు. ఆయనతో పాటు చింతలపూడి పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ నాయకులు రామాంజుల పెదమధు, రామాంజుల చినమధు, పసుపులేటి వీరాస్వామి, శ్రీ మన్యం జగ్గమ్మ గారి సత్రం చైర్మన్ నంబూరు శ్రీ గంగాపవన్ తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి


బొండాడలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పీవీఎల్

కాళ్ల: ప్రతి ఒక్కరు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. బొండాడలో గ్రామ పంచాయతీ, భీమవరం అశోక్ కిడ్నీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. శిబిరాన్ని పీవీఎల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సుగర్, బీపీ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా కిడ్నీ, లివర్ పరీక్షలు ఎప్పటికప్పుడు చేయించుకోవాలన్నారు. గ్రామంలో పెద్ద ఎత్తున మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు మన్నే నాగరాజు, వైద్యులు భూపతిరాజు అశోక్‌వర్మలను అభినందించారు. రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శిబిరంలో సుమారు 300 మంది రోగులకు వైద్యులు అశోక్ వర్మ, వి.సందీప్ కుమార్ వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా పీవీఎల్, వైద్యులు అశోక్‌వర్మ, పెనుమత్స విశ్వనాథరాజు, రామకృష్ణంరాజులను గ్రామ పెద్దలు సత్కరించారు.

క్రికెట్ పోటీల విజేత కుంచనపల్లి జట్టు

పెంటపాడు: అంబేడ్కర్ జయంతి పురస్కరించుకొని పెంటపాడు ఎస్టీవీఎస్ హిందూ హైస్కూల్లో నిర్వహిస్తున్న జైభీమ్ యూత్ అసోషియేషన్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో కుంచనపల్లి టీం రన్నర్‌గా, గూడెం భాగ్యలక్ష్మిపేట టీం విన్నర్‌గా నిలిచారు. విన్నర్ టీంకు రూ.15 వేలు, రన్నర్ టీంకు రూ.10 వేలు చొప్పున దాత బి. ప్రీతం చక్రవర్తి సహకారంతో నిర్వాహకులు బహుమతిగా అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఈశ్వరరావు దంపతులు, పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు దేవాబత్తుల నాగమణి, బాబి దంపతులు, విశ్రాంత ఆరోగ్యశాఖ అధికారి దేవాబత్తుల శామ్యూల్ రాజు, పడాల చిరంజీవిరెడ్డి, జైభీమ్ అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక


లూథరన్ హైస్కూల్ 2002-03 బ్యాచ్ విద్యార్థులు

సాక్షి, భీమవరం: 'ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాం.. చదువులమ్మ చెట్టు నీడలో' అంటూ ఆనాటి జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. పట్టణంలోని లూథరన్ హైస్కూల్ 2002–2003 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన 20 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలరించుకుంటూ కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30 నుంచి చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవాలు

ఉండి: ఉప్పులూరులో వేంచేసియున్న చెన్నకేశవ స్వామి కల్యాణమహోత్సవాలు ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ యర్రా వెంకట సుబ్బారావు ఆదివారం చెప్పారు. తొలిరోజు అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలతో కల్యాణోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మే 1న దివ్యతిరు కల్యాణం, 3న స్వామివారి ఎదురు సన్నాహం, 4న తెప్పోత్సవం, 5న రథోత్సవం కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. 6వ తేదీన నిర్వహించే అఖండ అన్నసమారాధనతో కల్యాణోత్సవాలు ముగుస్తాయన్నారు.

26న వాహన వేలం

తాడేపల్లిగూడెం రూరల్: ఎస్ఈబీ కేసులో స్వాధీనం చేసుకున్న స్ప్లెండర్ వాహనానికి ఈ నెల 26వ తేదీ ఉదయం 9 గంటలకు తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద వేలం పాట నిర్వహిస్తున్నట్టు ఎస్సై వీఎస్.వీరభద్రరావు తెలిపారు. ఆసక్తి గల వారు తమ ఆధార్ కార్డుతో హాజరు కావాలని కోరారు.

అమ్మో.. ఓపెన్ సైట్లు

- ఖాళీ స్థలాలతో పారిశుద్ధ్య ఇబ్బందులు
- దోమలకు నిలయంగా మారుతున్న వైనం


పట్టణంలో 30వవార్డులో రోడ్డు ప్రక్కన పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉన్న ఖాళీ స్థలం

నరసాపురం: ఇటీవల ఇళ్ల స్థలాల కొనుగోళ్లు, అమ్మకాలు అనేది ఓ వ్యాపారంగా మారింది. స్థలాలు కొనడం, రేటు పెరుగుతుందని అలాగే వదిలేయడం చేస్తున్నారు. అయితే పట్టణంలో పలు ప్రాంతాల్లో ఇళ్ల మధ్య ఉన్న ఈ ఖాళీ స్థలాల కారణంగా పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సదరు స్థలాల యజమానులు తమ స్థలాలకు సరైన రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారవుతుంది. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోయి, దోమలు పెరిగి పారిశుద్ధ్యం క్షీణిస్తుంది. పట్టణంలో స్టేషన్‌పేట, రుస్తుంబాద, రాయిపేట, హౌసింగ్ బోర్డు కాలనీ, చలువ పేట, ఎన్టీఆర్ కాలనీ, వీవర్స్ కాలనీ, నందమూరి కాలనీ, చినమామిడిపల్లి ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఈ స్థలాలన్నీ ఇళ్ల మధ్యే ఉండటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి పోతున్నాయి. అలాగే చెత్త చెదారం చేరి, దోమలకు ఆలవాలంగా మారుతున్నాయి. దీంతో చుట్టుపక్కల వారు రోగాలబారిన పడుతున్నారు. ఇలాంటి ఖాళీ స్థలాల వద్దకు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. వైఎస్సార్ కాలనీ శివారు ఆదర్శ్ కాలనీ వద్ద, ఎన్టీఆర్ కాలనీ వద్ద ఈ పరిస్థితిని గమనించవచ్చు.

పట్టించుకోని మునిసిపల్ అధికారులు...

పట్టణంలో ఎక్కడెక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయే గుర్తించి, ఆ స్థలాలు పూర్తి స్థాయిలో శుభ్రంగా వుండేలా మునిసిపల్ అధికారులు నిరంతరం చర్యలు చేపట్టాలి. అయితే అది జరగడం లేదు. మూడేళ్ల క్రితం కొంత మంది ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి, తమ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అయితే అటు తర్వాత ఆ అంశాన్ని వదిలేశారు. దీంతో సమస్య మొదటికొచ్చింది. పట్టణంలో మొత్తంగా 250 వరకూ ఖాళీ స్థలాలు వివిధ ప్రాంతాల్లో ఉన్నట్టు అంచనా. చాలా స్థలాలకు సంబంధించి మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పన్నులు కూడా కట్టడం లేదని తెలుస్తోంది. ఓ వైపు మునిసిపాలిటీ ఆదాయమూ కోల్పోయి, మరో వైపు పారిశుద్ధ్య ఇబ్బందులూ పెరగుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఈ సమస్యపై దృష్టి పెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.